ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం: 42.3 । కనిష్ఠం: 27.0
ANDHRAJYOTHY
1
మహబూబ్‌నగర్
జిల్లా వార్తలు
శుక్రవారం 26 ఏప్రిల్ 2024



బీజేపీ రోడ్ షో సక్సెస్

- భరత్ ప్రసాద్ నామినేషన్ దాఖలు - పాల్గొన్న గుజరాత్ సీఎం భూపేంద్రభాయ్ పటేల్



రోడ్ షోలో పాల్గొన్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు

నాగర్‌కర్నూల్ టౌన్, ఏప్రిల్ 25: బీజేపీ నాగర్ కర్నూల్ పార్లమెంటు అభ్యర్థి భరత్‌ప్రసాద్ తన మూడో సెట్ నామినేషన్ అనంతరం పట్టణంలో నిర్వహించిన రోడ్‌షో సక్సెస్ అయ్యింది. బస్ డిపో నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు రోడ్‌షో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్రభాయ్ పటేల్, కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి హాజరయ్యారు. మహిళల కోలాటాలు, కళాకారుల డప్పులు, కార్యకర్తల బైక్ ర్యాలీతో పట్టణమంతా కాషాయ మయమైంది. ర్యాలీ అంబేడ్కర్ కూడలికి చేరుకోగానే బీజేపీ ఎంపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్ రావు అధ్యక్షతన నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ముఖ్య అతిథులతో పాటు జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజీ ఆచారి, ఎంపీ పోతుగంటి రాములు, అభ్యర్థి భరత్ ప్రసాద్ ప్రసంగించారు. ఈ సందర్భంగా తల్లోజు అచారి మాట్లాడుతూ పూటకో పార్టీ, గంటకో పార్టీ మారే ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, ఎప్పుడో ఎంపీగా పని చేసిన మల్లు రవిని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. ఎంపీ పోతుగంటి రాములు మాట్లాడుతూ తాను ఎంపీగా పని చేసిన ఐదేళ్ల కాలంలో ఏం చేశారని ప్రశ్నించే వారు తన హయంలోనే కల్వకుర్తి నుంచి నంద్యాల వరకు రూ.1,500 కోట్లతో జాతీయ రహదారి తెచ్చిన సంగతి గుర్తించాలన్నారు. ఎంపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్ మాట్లాడుతూ జడ్పీ చైర్మన్ కాకుండా అడ్డుకున్న నాడే ఎంపీగా చట్ట సభల్లోకి వెళ్లాలని నిర్ణయించుకున్నాను అని తెలిపారు. పార్లమెంటు ఎన్నికల్లో తనను గెలిపిస్తే మోదీ ఆశీర్వాదంతో ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ పార్లమెంటు ఎన్నికల చీఫ్ ఏజెంట్ జక్కా రఘునందన్‌రెడ్డి, నాగర్ కర్నూల్ అసెంబ్లీ ఇన్‌చార్జి దిలీప్, నాయకులు బుసిరెడ్డి సుబ్బారెడ్డి, బుసిరెడ్డి సుధాకర్‌రెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రోడ్ షోలో మాట్లాడుతున్న గుజరాత్ సీఎం భూపేంద్రపటేల్, పక్కన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ ఎంపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్

కాంగ్రెస్‌కు ఓటు అడిగే హక్కు లేదు

» బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ



మాగనూరులో మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ

మాగనూరు, ఏప్రిల్ 25 : కాంగ్రెస్ అంటేనే మోసం దగా అని, కాంగ్రెస్‌కు ఓటు అడిగే హక్కు లేదని బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ మండిపడ్డారు. గురువారం మండలంలోని అడవిసత్యారం, కొల్పూరు, వడ్వాటు, మాగనూరు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందాలంటే బీజేపీని గెలిపించాలని కోరారు. తిరిగి బీజేపీ గూటికి చేరుకున్న మాజీ బీజేపీ అధ్యక్షుడు జయందర్‌రెడ్డి, జయనందరెడ్డికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కృష్ణ మండలం ముడుమాల్, మురహర్‌దొడ్డి, గుడెబల్లూరు, కున్సీ, ఆలంపాలి, చేగుంట గ్రామాల్లో డీకే అరుణ సుడి గాలి పర్యటన చేశారు. అదే విధంగా మక్తల్ మండలంలోని సంగం బండ, లింగంపల్లి గ్రామాల్లో కూడా ప్రచారం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో బీజేపీ బీజేపీ రాష్ట్ర నాయకుడు నాగురావు నామాజీ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొండయ్య, ఎంపీపీ శ్యామలమ్మ, బీజేపీ జిల్లా నాయకుడు కర్నిస్వామి, మాగనూరు మండలాధ్యక్షుడు గొల్ల నారాయణ, బీజేపీ ప్రధాన కార్యదర్శి అశోక్‌గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కనకరాజు, ఓబీసీ జిల్లా నాయకుడు వాకిటి మల్లేష్, భీంరాజు, పరశురాం, అమరకుమార్‌దీక్షత్, మజ్జిగ సురేష్, సోమశేఖర్ గౌడ్, శ్రీనివాస్, రాజు, భీరప్ప, నల్లే నర్సప్ప, దండ రాఘవేంద్ర పాల్గొన్నారు.

పదేళ్లు అధికారంలో ఉండి

ఆగం చేసిండ్రు

- పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి



మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్యాంసుందర్‌రెడ్డికి కండువా కప్పుతున్న వంశీచంద్‌రెడ్డి

మిడ్జిల్, ఏప్రిల్ 25: పదేళ్ల కేంద్రం, రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు పాలమూరు ఉమ్మడి జిల్లాను అభివృద్ధి చేయకుండా నిర్లక్ష్యం చేశాయని కాంగ్రెస్ పార్టీ పాలమూరు ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డిలు అన్నారు. గురువారం మిడ్జిల్ మండలం భైరంపల్లి, కంచనపల్లి, సింగందొడ్డి, దోనూరు, బోయిన్‌పల్లి తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. మీనాంబర పరమవేదీశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భైరంపల్లిలోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేసి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఉమ్మడి పాలమూరును అభివృద్ధి చేస్తామని గత పార్లమెంట్ ఎన్నికలలో ఉద్దెర మాటలు చెప్పి గద్దెనెక్కిన నరేంద్రమోదీ పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయహోదా ఎందుకు ఇవ్వలేదో ప్రజలకు సమాధానం చెప్పిన తరువాత ఓట్లు అడుగాలని బీజేపీ అభ్యర్థి డీకే ఆరుణను డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కేసీఆర్ ప్రజా సంపదను కొల్లగొట్టి ఖజానాను ఖాళీ చేయడమే కాకుండా ప్రజల నెత్తిన అప్పుభారాన్ని మోపి అడ్డగోలు కూతలు కూస్తున్నారని విమర్శించారు. అవినీతి అక్రమాలతో ప్రజలను, ఈ ప్రాంతాన్ని దోపిడీ చేసి మరింత అస్తులు కూడబెట్టుకునేందుకు పాలమూరుకు వచ్చిన డీకే ఆరుణకు ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. పాలమూరు ఆత్మగౌరవాన్ని నరేంద్రమోదీకి తాకట్టు పెట్టకుండా ప్రతీ ఒక్కరు చేతి గుర్తుకు ఓటు వేసి పాలమూరు బిడ్డ సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిష్ఠతను పెంచుకోవాల్సిన అవసరం మనపై ఉందన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు

మిడ్జిల్, ఉర్కొండ ఉమ్మడి మండలాలకు చెందిన బీఆర్ఎస్ పార్టీకి చెందిన జడ్చర్ల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్యాంసుందర్‌రెడ్డి, ఆంజనేయస్వామి ఆలయ మాజీ చైర్మన్ బెక్కరి రాజశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ దీపా భర్త గోపాల్‌రెడ్డి, నాయకులు చెల్మారెడ్డి తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డిలు వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అల్వాల్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు గౌస్, నాయకులు రాజారెడ్డి, నర్సింహ్మా, నిఖిల్‌రెడ్డి ఉన్నారు.

బీఫాం అందజేసిన కాంగ్రెస్ మహిళా నాయకులు

మహబూబ్‌నగర్ : కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి తరపున అభ్యర్థిత్వ బీఫాం పత్రాలను గురువారం కలెక్టర్ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రవి గుగులోత్‌కు నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, గద్వాల, మహబూబ్‌నగర్, నారాయణపేట జడ్పీ చైర్‌పర్సన్లు స్వర్ణ సుధాకర్‌రెడ్డి, సరిత తిరుపతయ్య వనజమ్మలు అందజేశారు.



బీఫాం పత్రాన్ని అందజేస్తున్న కాంగ్రెస్ మహిళా ప్రజా ప్రతినిధులు

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

గోపాల్‌పేట, ఏప్రిల్ 25 : ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలం జయన్న తిరుమలాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై హరిప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వంగూరు కురుమూర్తి(35) కొంతకాలంగా ఎలాంటి పని లేకుండా తాగుడుకు బానిసయ్యాడు. దీంతో భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. గురువారం ఉదయం భార్యతో గొడవపడి ఇంట్లో ఎవరు లేని సమయంలో చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య రేవతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. మృతుడికి ముగ్గురు చిన్నపిల్లలు ఉన్నారు.

నగదు పట్టివేత

గోపాల్‌పేట, ఏప్రిల్ 25 : వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలం బుద్దారం గ్రామ పరిధిలోని గండి ఆంజనేయస్వామి దేవాలయం ఆవరణలో ఏర్పాటుచేసిన జిల్లా సరిహద్దు చెక్‌పోస్టు వద్ద రూ.52వేల నగదును పట్టుకున్నట్లు ఎస్సై హరిప్రసాద్ తెలిపారు. వనపర్తి జిల్లా కేంద్రానికి చెందిన రాములు తన వద్దనున్న రూ.52 వేల నగదుకు సంబంధించి ఎలాంటి రశీదు లేకపోవడంతో నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వివరించారు.

పోలీస్ తనిఖీల్లో రూ. 9,58,290 సీజ్

గద్వాల క్రైం, ఏప్రిల్ 25 : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో గురువారం జిల్లా వ్యాప్తంగా పోలీసులు నిర్వహించిన వాహనాల తనిఖీల్లో రూ. 9,58,290 పట్టుకున్నట్లు ఎస్పీ రితిరాజ్ తెలిపారు. గట్టు మండల కేంద్రంలో నిర్వహించిన వాహన తనిఖీల్లో రూ. 1,72,000, బల్గెర చెక్‌పోస్టు వద్ద రూ. 65,000, అయిజ పట్టణంలో రూ.90,000 సీజ్ చేశారు. మల్దకల్ మండల కేంద్రంలో రూ.70,000, ఇటిక్యాల పోలీస్ స్టేషన్ పరిధిలోని జింకలపల్లి స్టేజీ వద్ద రూ. 2,50,000, గద్వాల పట్టణంలో రూ. 2,60,000, అలంపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ర్యాలంపాడు చెక్‌పోస్టు దగ్గర రూ. 50,790 నగదు లభ్యమైంది. మొత్తం రూ. 9,58,290ను స్వాధీనం చేసుకొని జిల్లా ఎన్నికల గ్రీవెన్స్ రిడ్రెసల్ కమిటీకి అప్పగించినట్లు ఎస్పీ తెలిపారు.

రూ. లక్షా పద్నాలుగు వేలు పట్టివేత



కర్నూల్ జిల్లాకు చెందిన షేక్ నూర్ హమ్మద్ నుంచి రూ. 56 వేల నగదును స్వాధీనం చేసుకుంటున్న ఎస్ఐ తిరుపాజి

బాలానగర్, ఏప్రిల్ 25 : ఎన్నికల కోడు అమలులో భాగంగా మహబూబ్ నగర్ జిల్లా బాలానగర్ మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద బుధవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా రూ. లక్షకు పైగా నగదు పట్టుబడింది. స్థానిక ఎస్ఐ తిరుపాజి తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, కర్నూల్ జిల్లా, హసనాపురానికి చెందిన షేక్ నూర్‌హమ్మద్ వద్ద రూ.56 వేలు, వనపర్తి జిల్లా శ్రీరంగాపూర్‌కు చెందిన ఆంజనేయులు వద్ద రూ. 58వేలు కనిపించడంతో స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. పట్టు బడిన డబ్బులకు సరైన ఆధారాలు చూపి తిరిగి పొందవచ్చని ఎస్ఐ తెలిపారు.

పాలమూరుకు గులాబీ బాస్

- నేడు మహబూబ్‌నగర్.. రేపు నాగర్‌కర్నూల్‌లో బస్సు యాత్ర

- అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత తొలిసారి కేసీఆర్ పాలమూరు పర్యటన



మహబూబ్‌నగర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత తొలిసారి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్.. పాలమూరు జిల్లా పర్యటనకు రానున్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థుల గెలుపు కోసం ఇప్పటికే బస్సు యాత్ర ప్రారంభించిన కేసీఆర్.. శుక్రవారం మహబూబ్‌నగర్‌లో, శనివారం నాగర్‌కర్నూలులో పర్యటించనున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి పాలమూరులోని 14 స్థానాలకు గాను రెండు స్థానాలు మాత్రమే గెలుచుకున్న బీఆర్ఎస్ పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటి.. పార్టీకి పూర్వవైభవం తీసుకురావాలని భావిస్తోంది. ఇందులో భాగంగానే నిరాశలో ఉన్న పార్టీ కేడర్‌ను ఉత్తేజ పరిచేందుకు కేసీఆర్ పార్లమెంట్ నియోజకవర్గాల పర్యటనను చేపట్టారు.

ఇటీవల జరిగిన 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఘోర పరాజయం పాలైంది. ఐదేళ్లు మంత్రులుగా ఉన్న వారు కూడా భారీ తేడాతో ఓటమి చెందారు. అప్పటి నుంచి కేడర్‌లో నైరాశ్యం ఏర్పడింది. కాంగ్రెస్, బీజేపీలు చేపట్టిన ఆపరేషన్ ఆకర్ష్‌లో చాలామంది ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు పార్టీలు మారారు. నాగర్‌కర్నూల్ ఎంపీ పోతుగంటి రాములు బీజేపీలో చేరి.. ఆ పార్టీ నుంచి తన కుమారుడు భరత్‌ప్రసాద్‌కు ఎంపీ టిక్కెట్ దక్కించుకున్నారు.. వనపర్తి జడ్పీచైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, నాగర్‌కర్నూలు కీలక నాయకుడు జక్కా రఘునందన్‌రెడ్డి బీజేపీలో చేరారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో జడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరగా.. పలు మునిసిపాలిటీల్లో కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానాలు, రాజీనామాల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేసింది.

అభ్యర్థులను గెలిపించుకునేందుకే..

గత పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ నుంచి మన్నె శ్రీనివాస్‌రెడ్డి మొదటిసారి పోటీచేసి 77,829 మెజారిటీతో గెలుపొందారు. ఈ ఎన్నికల్లో కూడా ఆయననే అభ్యర్థిగా బీఆర్ఎస్ ఖరారు చేసింది. ఈ పార్లమెంట్ పరిధిలో బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులతో పోలిస్తే కాస్త ఆలస్యంగా ప్రచారం ప్రారంభించినప్పటికీ.. ప్రస్తుతం పార్లమెంట్ నియోజకవర్గం వ్యాప్తంగా దూకుడుగా ప్రచారం చేస్తున్నారు. ఈ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో గతంలో ఏడుగురు ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ వారే గెలవగా.. ఇప్పుడు పరిస్థితి తలకిందులై.. మొత్తం ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌కు చెందిన వారే గెలవడం బీఆర్ఎస్‌కు కొంత బలహీతగా చెప్పవచ్చు.

నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలో 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరపున పోటీచేసిన పీ రాములు 1.89 లక్షల ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఈ పార్లమెంట్ ఎన్నికలకు ముందు ఆయన బీఆర్ఎస్‌ను వీడి బీజేపీలో చేరారు. ఆయన కుమారుడు భరత్‌ప్రసాద్‌కు బీజేపీ టిక్కెట్ ఖరారు చేసింది. ఈ పార్లమెంట్ పరిధిలో గద్వాల, అలంపూర్‌కు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే ప్రాతినిధ్యం వహిస్తుండగా.. మాజీ ఐపీఎస్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను ఆ పార్టీ అభ్యర్థిగా నిలిపింది. ఆయన ఈ పార్లమెంట్‌కు స్థానికుడు కావడం.. ఇంకా బీఆర్ఎస్ కేడర్ క్షేత్రస్థాయిలో ఉండటం బలం కాగా.. మెజారిటీ స్థానాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉండటం.. కొంతమంది నాయకులు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్, బీజేపీలో చేరడం కొంత బలహీనతగా చెప్పవచ్చు. గత ఎన్నికల్లో భారీ మెజారిటీతో విజయం సాధించిన పార్టీ.. అసెంబ్లీ ఎన్నికల్లో చతికిలపడి.. పార్లమెంట్ ఎన్నికల ద్వారా పూర్వవైభవం కోసం ప్రయత్నిస్తోంది. ఇద్దరు అభ్యర్థులను గెలిపించుకునేందుకు కేసీఆర్ ఈ రెండు పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో బస్సు యాత్ర చేపట్టారు.

పార్లమెంట్ ఎన్నికలు.. పారదర్శకంగా నిర్వహించాలి



సమావేశంలో పాల్గొన్న పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు, ఎక్స్పెండిచర్ అబ్జర్వర్ సౌరభ్, సాధారణ పరిశీలకులు రుచేష్ జైవన్షి, పోలీస్ అబ్జర్వర్ అమోగ్ జీవన్ గోయింగ్కర్

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : పార్లమెంట్ ఎన్నికలు సజావుగా పారదర్శకంగా నిర్వహించేందుకు సంబంధిత నోడల్ అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లాకు నియమించబడిన పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు, ఎక్స్పెండిచర్ అబ్జర్వర్ సౌరభ్, సాధారణ పరిశీలకులు రుచేష్ జైవన్షి, పోలీస్ అబ్జర్వర్ అమోగ్ జీవన్ గోయింగ్కర్‌లు అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో పార్లమెంట్ నియోజకవర్గ సాధారణ పరిశీలకులు, పోలీస్ అబ్జర్వర్స్, ఎక్స్పెండించర్ అబ్జర్వర్‌లతో వనపర్తి జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్‌పవార్, గద్వాల జిల్లా కలెక్టర్ బీఎం.సంతోష్, నాగర్‌కర్నూల్ జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, గద్వాల జిల్లా ఎస్పీ రితిరాజ్, వనపర్తి జిల్లా ఎస్పీ రక్షిత కే.మూర్తి, నాగర్‌కర్నూల్ జిల్లా అదనపు కలెక్టర్లు కుమార్‌దీపక్, సీతారామారావు, వనపర్తి జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, నగేష్, గద్వాల అదనపు కలెక్టర్లు అపూర్వ చౌహాన్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఎన్నికల అబ్జర్వర్స్ మాట్లాడుతూ ఎన్నికలను స్వేచ్ఛగా పారదర్శకంగా శాంతియుతంగా నిర్వహించేందుకు అధికారులందరూ సమాయత్తం కావాలని, ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థుల ఖర్చును జాగ్రత్తగా అంచనా వేయాలని, వారి ప్రతి కదలికలను గుర్తించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని కోరారు. ఫ్లయింగ్ స్క్వాడ్స్ నిరంతరం నిఘా ఉంచాలని, ఎన్నికల నోడల్ ఆఫీసర్లు ఎన్నికల అధికారులతో సమన్వయం చేసుకుంటూ సూపర్‌విజన్ చేయాలని, మానిటరింగ్ టీమ్స్ అభ్యర్థుల ప్రతీ కదలికలను, ప్రతి ఖర్చును క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. అనంతరం కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ మూడు జిల్లాల అధికారులతో మొదటి సమావేశం ఏర్పాటు చేసినట్లు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని జిల్లాలో ఏడు శాసనసభ నియోజకవర్గాల్లో ఎన్నికల నిర్వహణ కొరకు ఫ్లయింగ్, స్టాటిక్ సర్వేయలైన్స్ వీడియో సర్వేయలైన్స్, వీడియో పరిశీలన, సహాయ ఖర్చుల పరిశీలకులు, అకౌంటింగ్ బృందాలు, ఎంసీఎంసీ, కంట్రోల్ రూమ్, ఖర్చుల పర్యవేక్షణ కమిటీలు, నోడల్ అధికారులు సమన్వయంతో పని చేసి జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా కృషి చేయాలని తెలిపారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో సాధారణ, ఎన్నికల పరిశీలకులు ఎన్నికల ప్రక్రియను పరిశీలిస్తారని, జిల్లాలోని అసెంబ్లీ సెగ్మెంట్ల వారిగా అధికారులు ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని తెలిపారు. మ్యాన్‌పవర్ నిర్వహణలో భాగంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బంది, నియామకం, ర్యాండమైజేషన్ ప్రభుత్వ శాఖల సమన్వయంతో నిర్వహించాలని శిక్షణ నిర్వహణలో భాగంగా ఎన్నికల కార్యకలాపాల్లో పాల్గొనే అధికారుల సామర్థ్యం పెంపుదల, శిక్షణ, వేదికల ఏర్పాట్లు, సామగ్రి పంపిణీ, రాజకీయ పార్టీల అభ్యర్థులు ఏజెంట్లకు శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు.

ఎన్నికల నిర్వహణ కోసం నియమించబడిన ప్రత్యేక బృందాల ద్వారా నిరంతరం పర్యవేక్షించడం జరుగుతుందని, జిల్లాలో పోలింగ్ శాతాన్ని పెంపొందించే విధంగా అధికారులు కృషి చేయాలని తెలిపారు.

తుంగభద్ర ఎక్స్‌ప్రెస్ గంటన్నర ఆలస్యం

» ఇబ్బంది పడిన ప్రయాణికులు

ఉండవల్లి, ఏప్రిల్ 25 : జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండల పరిధిలోని జోగుళాంబ రైల్వే స్టేషన్‌కు గురువారం తుంగభద్ర ఎక్స్‌ప్రెస్ రైలు గంటన్నర పాటు ఆలస్యంగా వచ్చింది. మధ్యాహ్నం 3.15 గంటలకు రావలసిన రైలు సాయంత్రం 4.45 నిమిషాలకు వచ్చింది. దీనితో గంటన్నర పాటు ప్రయాణికులు ఎండలో పడిగాపులు కాయాల్సి వచ్చింది. స్టేషన్ హాల్ చిన్నదవడం, కనీసం తాగునీరు అందుబాటులో లేకపోవడంతో తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. మూత్రశాలలు లేక మహిళలు అసహనం వ్యక్తం చేశారు. దీనికి తోడు స్టేషన్లో కోతుల బెడద ఎక్కువగా ఉండటంతో ఆందోళనకు గురయ్యారు. స్టేషన్లో సౌకర్యాలు మెరుగుపరచాలని ప్రయాణికులు సంబంధిత అధికారులను కోరారు.



జోగుళాంబ రైల్వే స్టేషన్‌లో ఎండలో నిల్చున్న ప్రయాణికులు

అంగన్‌వాడీల్లో సిబ్బంది కొరత

» ఖాళీగా 62 టీచర్, 173 హెల్పర్ పోస్టులు » సక్రమంగా సాగని పౌష్టికాహారం పంపిణీ



లబ్ధిదారులకు గుడ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం



గద్వాలలో మూడవ వార్డులో మూతపడిన కేంద్రం

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం



అంగన్‌వాడీల్లో టీచర్లు, ఆయాల కొరత ఉన్నది వాస్తవమే. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. కానీ ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున సిబ్బందిని నియమించే అవకాశం లేదు. ఎన్నికల అనంతరం ఉన్నతాధికారుల ఆదేశం మేరకు పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటాం.

- సుధారాణి, జిల్లా సంక్షేమాధికారి

గద్వాల న్యూటౌన్, ఏప్రిల్ 25 : జిల్లాలోని అంగన్ వాడీ కేంద్రాలను సిబ్బంది కొరత వేధిస్తోంది. దీంతో ఆయా కేంద్రాల నిర్వహణకు ఇబ్బంది కలుగడంతో పాటు చిన్నారులు, గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ సక్రమంగా సాగడం లేదు. ఈ పరిస్థితుల్లో కేంద్రాలకు వచ్చే చిన్నారుల సంఖ్య తగ్గుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లాలో మొత్తం 713 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. అందులో గద్వాల అర్బన్ పరిధిలో 262, రూరల్ పరిధిలో 213, మానవపాడు మండలంలో 238 కేంద్రాలున్నట్లు అధికారులు చెప్తున్నారు. జిల్లాలో గర్భిణులు 5,785, బాలింతలు 3,389, మూడేళ్లలోపు చిన్నారులు 28,104, మూడు నుంచి ఆరేళ్లలోపు చిన్నారులు 23,844 మందితో మొత్తంగా 61,122 మంది ఉన్నారు. వీరికి అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం, గుడ్లు, ఆహారం పంపిణీ చేయాల్సి ఉంది. కానీ టీచర్లు, ఆయాల కొరతతో పంపిణీ సక్రమంగా జరగడం లేదన్న ఆరోపణలున్నాయి.

జిల్లా కేంద్రంలోనే ఎక్కువ ఖాళీలు

అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు, ఆయాల పోస్టులు ఖాళీగా ఉండటంతో ఉన్నవారితోనే అధికారులు నెట్టుకొస్తున్నారు. జిల్లాలో 62 అంగన్‌వాడీ టీచర్ పోస్టులు, 173 హెల్పర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు అధికారులు చెప్తున్నారు. కానీ ఈ సంఖ్య ఇంకా ఎక్కువగానే ఉన్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా జిల్లా కేంద్రంలోనే ఎక్కువ ఖాళీలు ఉన్నట్లు సమాచారం. జిల్లా కేంద్రంలోని హమాలీకాలనీ, పిల్లిగుండ్ల, వేణుకాలనీ, చింతలపేటలతో పాటు మరికొన్ని కాలనీల్లోని అంగన్‌వాడీల్లో టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పాతహౌసింగ్‌బోర్డుకు చెందిన ఓ అంగన్‌వాడీ టీచర్ ఇటీవల రాజీనామా చేశారు. ఈ క్రమంలో కొన్ని కాలనీల్లోని కేంద్రాలను ఇతర ప్రాంతాలకు మార్చారు. మూడవ వార్డులో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్, ఆయా లేకపోవడంతో ఇతర కేంద్రాల టీచర్లు అప్పుడప్పుడు వచ్చి చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టిహాకారం పంపిణీ చేస్తున్నారు. అధికారులు స్పందించి అంగన్‌వాడీల్లో పూర్తిస్థాయి సిబ్బందిని నియమించాలని మహిళలు కోరుతున్నారు.

చికిత్స పొందుతూ ఇద్దరి మృతి

ఊర్కొండ, ఏప్రిల్ 25: గత కొన్ని రోజులుగా ఆరోగ్య కారణాల వల్ల చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం... కల్వకుర్తి మండలంలోని ఎల్లికల్ గ్రామానికి చెందిన బొల్లు కృష్ణయ్య (46) ఊర్కొండ మండలంలోని మాదారం గ్రామానికి చెందిన బంగారమ్మతో 12 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి 10 సంవత్సరాలు బాలుడు ఉన్నాడు. వృత్తి రీత్యా కల్వకుర్తిలోని హోటల్‌లో పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. భార్య స్వస్థలం అయిన మాదారం గ్రామానికి రాకపోకలు సాగిస్తుండే వాడు. అనారోగ్యం పాలైన వ్యక్తికి చికిత్స అందిస్తుండగా గురువారం మృతి చెందగా, మృతుడి కుటుంబ సభ్యులు భార్య బంగారమ్మపై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారని తెలిపారు. దాంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని అన్నారు. మృతదేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించామని ఎస్సై పేర్కొన్నారు.

జోగుళాంబ గద్వాల జిల్లాలో..

గద్వాల, ఏప్రిల్ 25 : పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. రూరల్ ఎస్ఐ పర్వతాలు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా గద్వాల మండల పరిధిలోని జిల్లెడుబండ గ్రామానికి చెందిన అనంతమ్మ(48) కృష్ణ దంపతుల మధ్య ఈ నెల 23న ఘర్షణ జరిగింది. ఈ సందర్భంగా భర్త మందలించడంతో మనస్తాపానికి గురైన ఆమె పురుగుల మందు తాగింది. దీంతో ఆమెను కర్నూలులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందింది. ఈ విషయంపై ఆమె తమ్ముడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ తెలిపారు. అనంతమ్మ, కృష్ణ దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

విద్యుదాఘాతంతో గడ్డి ట్రాక్టర్ దగ్ధం

ఉప్పునుంతల, ఏప్రిల్ 25 : విద్యుదాఘాతంతో గడ్డి ట్రాక్టర్ దగ్ధమైంది. ఈ సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండల పరిధిలోని పెనిమిళ్ల గ్రామంలో చోటుచేసుకొంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. పూర్యతండా గ్రామానికి చెందిన నేనావత్ పాండు పెనిమిళ్ల గ్రామంలో వరి గడ్డి కొనుగోలు చేశారు. ఉదయం ట్రాక్టర్‌లో వరి గడ్డిని నింపుకొని స్వగ్రామమైన పూర్యతండాకు తీసుకెళుతుండగా పెనిమిళ్ల సమీపంలో షార్ట్ సర్క్యూట్‌తో గడ్డికి నిప్పు అంటుకొని మంటలు చేలరేగాయి. రైతులు మంటలు ఆర్పే ప్రయత్నం చేస్తున్నా అదుపులోకి రాకపోవడంతో అగ్ని మాపక కేంద్రానికి సమాచారం అందించారు. ఫైర్ ఇంజన్ వచ్చేలోపే మంటలు మరింత తీవ్రతరం కావడంతో అప్రమత్తమైన రైతులు వెంటనే ట్రాక్టర్ ఇంజన్ను వేరు చేశారు.

అగ్ని మాపక కేంద్రం మంటలు ఆర్పేలోపే ట్రాక్టర్ ట్రాలీ టైర్లు గడ్డి పూర్తిగా దగ్ధమైనట్లు గ్రామస్థులు తెలిపారు. దాదాపు 80 వేల వరకు నష్టం జరిగినట్లు గ్రామస్థులు తెలిపారు.

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో 'ప్రతిభ' విద్యార్థుల దూకుడు



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల గౌరవ సలహాదారులు, యాజమాన్యం

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఏప్రిల్ 25 : జేఈఈ మెయిన్ తుది ఫలితాల్లో జిల్లా కేంద్రంలోని ప్రతిభ జూనియర్ కళాశాల విద్యార్థులు దూకుడు ప్రదర్శించారు. జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ విద్యార్థి ఎన్.ప్రవీణ్ ఆల్‌ఇండియా కేటగిరిలో 8వ ర్యాంకు సాధించగా, కె. స్వర్ణ జాతీయస్థాయి 25వ ర్యాంక్, కార్తిక్ సాగర్ 99.83 పర్సంటైల్, ఎ.గణేష్ 99.40 పర్సంటైల్, బి. అనిరుధ్‌గౌడ్ 98.22 పర్సంటైల్, బి. శ్రీకాంత్ 98.61 పర్సంటైల్, శ్రీను 97.62 పర్సంటైల్, సాయిఈశ్వర్ 96.76 పర్సంటైల్, ఉమేష్‌చంద్ర 95.05 పర్సంటైల్, ఎ. హంసిని 93.97 పర్సంటైల్, విష్ణువర్ధన్ రెడ్డి 93.14 పర్సంటైల్, వర్షిక 92.92 పర్సంటైల్, శ్రీకాంత్ 92.39 పర్సంటైల్, నవ్యశ్రీ 92.21 పర్సంటైల్, అరవింద్ 91.60 పర్సంటైల్, నిఖిత 91.10 పర్సంటైల్ సాధించారు. 55 మందికి 90 పర్సంటైల్ సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల గౌరవ సలహాదారులు కె.మంజులాదేవి, వి.లక్ష్మారెడ్డి, కె.విష్ణువర్ధన్‌రెడ్డి, కె.జనార్ధన్‌రెడ్డి, జి.వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ఎం.కృష్ణయ్య, వెంకట్రామయ్య, ఎస్. వెంకట్ రెడ్డిలు విద్యార్థులను అభినందించారు.

జేఈఈలో 'రిషి' విద్యార్థుల జయకేతనం



విద్యార్థులతో కళాశాల ముఖ్య సలహాదారు వెంకటయ్య, డీన్ భూపాల్‌రెడ్డి



జీ. సాకేత్‌సింగ్ 99.60



కే.కౌశిక్ యాదవ్ 98.87

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఏప్రిల్ 25 : జేఈఈ మెయిన్స్ తుది ఫలితాల్లో జిల్లా కేంద్రంలోని రిషి నీట్, ఐఐటీ అకాడమీ, జూనియర్ కళాశాల విద్యార్థులు జయకేతనం ఎగుర వేశారు. జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో కళాశాలకు చెందిన జి.సాకేత్ సింగ్ 99.60 పర్సంటైల్ కె.కౌసిక్ యాదవ్ 98.87 పర్సంటైల్, వినయ్‌రెడ్డి 98.67 జాతీయస్థాయిలో ర్యాంకులు సాధించి అగ్ర భాగాన నిలిచారు. ఈ సందర్భంగా గురువారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ చంద్రకళావెంకట్, ముఖ్య సలహాదారు వెంకటయ్య, డీన్ భూపాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ హరిబాబు అభినందించారు. సాకేత్‌సింగ్ ఫిజిక్స్‌లో 100 పర్సంటైల్ సాధించగా విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించింది.

ఇంటర్ ఫలితాల్లో 'అక్షర' విద్యార్థుల విజయకేతనం



విద్యార్థులతో కళాశాల కార్యదర్శి ఫణిప్రసాద్, తదితరులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఏప్రిల్ 25 : ఇంటర్మీడియట్ మొదటి, రెండవ ఏడాది పరీక్ష ఫలితాల్లో జిల్లా కేంద్రంలోని అక్షర జూనియర్ కళాశాల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. ఇంటర్ ఫలితాల్లో అక్షర కళాశాలకు చెందిన రెండవ ఏడాది ఎంపీసీ విభాగానికి చెందిన సుహారిత్ భరద్వాజ 1000 మార్కులకు గాను 988 మార్కులు, పి. శిరీష 976, గాయత్రి, నేహతబస్సుం 973, త్రిపుర 967, రేశ్మిత 946 మార్కులు సాధించారు. బైపీసీ విభాగంలో ఆమేనా తబస్సుం 974 మార్కులు ఆసియా తబస్సుం 960, అఫ్ససిద్దికి 953 మార్కులు సాధించారు. మొదటి ఏడాది బైపీసీ విభాగంలో కుమారి అయేషాఇస్రాసిద్దికి 440 మార్కులకుగాను 437 మార్కులు, భార్గవి 436, లక్ష్మీప్రియ 436, సానియాఆఫ్‌సైన్ 436 సౌమ్య 431 మార్కులు సాధించారు. ఎంపీసీ విభాగంలో అఖిల్‌గౌడ్ 470 మార్కులకు గాను 462 మార్కులు, కృతిశ్రీ 460, కౌశిక 457 మార్కులు సాధించి టాపర్స్‌గా నిలిచారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల కార్యదర్శి ఫణిప్రసాద్, డైరెక్టర్, అధ్యాపకులు, యాజమాన్యం విద్యార్థులను గురువారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అభినందించారు.

ముగిసిన నామినేషన్ల పర్వం..!

» మహబూబ్‌నగర్ లోక్‌సభ స్థానానికి 32 మంది అభ్యర్థుల నామినేషన్

» నాగర్‌కర్నూల్ లోక్‌సభ స్థానానికి 34 మంది నామినేషన్

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : పార్లమెంట్ ఎన్నికల్లో తొలి అంకం ముగిసింది. నామినేషన్ల దాఖలుకు గురువారం ఆఖరు కావడంతో మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానానికి 32 మంది అభ్యర్థులు 58 సెట్ల నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థి డీకే అరుణ, బీఆర్ఎస్ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ధర్మసమాజ్ పార్టీ అభ్యర్థి జి. రాకేష్, స్వతంత్ర అభ్యర్థి కారుకొండ శ్రీనివాసులు నాలుగు సెట్ల చొప్పున నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థి హరీందర్‌రెడ్డి మల్లెల మూడు సెట్ల నామినేషన్ పత్రాలు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రవి గుగులోత్‌కు అందజేశారు.

- నాగర్‌కర్నూల్ పార్లమెంటుకు మొత్తం 34 అభ్యర్థుల నుంచి మొత్తం నామినేషన్ల సంఖ్య 53

నామినేషన్ వేసిన అభ్యర్థులు వీరే..

అభ్యర్థి పేరు	పార్టీ
1) డీకే అరుణ	బీజేపీ
2) చల్లా వంశీచంద్‌రెడ్డి	కాంగ్రెస్
3) మన్నె శ్రీనివాస్‌రెడ్డి	బీఆర్ఎస్
4) ఈరమోని సురేందర్	స్వతంత్ర
5) జి. రాకేష్	ధర్మ సమాజ్ పార్టీ
6) కారుకొండ శ్రీనివాసులు	స్వతంత్ర
7) కండితి శేఖర్‌రెడ్డి	విడుతలై చిరుతైగల్ కట్చి పార్టీ
8) అందారి అంజయ్య	స్వతంత్ర
9) హరిందర్‌రెడ్డి మల్లెల	స్వతంత్ర
10) మహ్మద్ అల్లావుద్దిన్	బహుజన్ సమాజ్ పార్టీ 2
11) వెంకటరమణ	స్వతంత్ర
12) కాయ్ జంగయ్య	స్వతంత్ర
13) వెంకటేశ్వర్లు తల్లాడ	అలియన్స్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ పార్టీ
14) సబావత్ విజయ	స్వతంత్ర
15) సబావత్ శ్రీనివాస్	స్వతంత్ర
16) గంబావతు దినేశ్	స్వతంత్ర
17) మహ్మద్ అబ్దుల్ రహీమ్	స్వతంత్ర
18) హనుమేష్	స్వతంత్ర
19) నడిమికంటి శ్రీనివాసులు	స్వతంత్ర
20) ముడావత్ బాలరాజు నాయక్	స్వతంత్ర
21) పి. సందీప్‌కుమార్‌రెడ్డి	స్వతంత్ర
22) కె. రామలింగప్ప	స్వతంత్ర
23) బండ సత్యనారాయణ	స్వతంత్ర
24) గోవిందమ్మ	స్వతంత్ర
25) బుయ్యకారి రవీందర్	సోషల్ జస్టిస్ పార్టీ ఆఫ్ ఇండియా
26) ఎన్. నరేష్‌రెడ్డి	తెలంగాణ జాగీర్ పార్టీ
27) విష్ణువర్ధన్‌రెడ్డి తపాలకింది	స్వతంత్ర
28) అనీసుర్ రెహ్మాన్	బహుజన్ ముక్తి పార్టీ
29) సంగపాగ సరోజనమ్మ	స్వతంత్ర
30) షేక్ మున్నా బాషఆల్ ఇండియా	మజ్లిస్ ఈ ఇత్తేదుల్ ముస్లిమిన్
31) ఉమాశంకర్ నెమ్మికంటి	స్వతంత్ర
32) మహ్మద్ ఇంతియాజ్ అహ్మద్	స్వతంత్ర

మద్యం పట్టివేత

రాజోలి, ఏప్రిల్ 25 : జోగుళాంబ గద్వాల జిల్లా రాజోలి మండలంలోని పెద్ద తాండ్రపాడు గ్రామానికి చెందిన కుమార్‌గౌడు అనే వ్యక్తి అక్రమంగా మద్యం తరలిస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేసినట్లు రాజోలి ఎస్ఐ జగదీశ్వర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కుమార్‌గౌడ్ గ్రామంలోని తన కూల్‌డ్రింక్ షాపులో విక్రయించేందుకు రాజోలి నుంచి మద్యాన్ని ద్విచక్రవాహనంపై తీసుకెళ్తుండగా, హెడ్ కానిస్టేబుల్ ఈరన్న తనిఖీ చేశారు. అతడి వద్ద దాదాపు రూ.13వేల విలువైన మద్యం లభించడంతో స్వాధీనం చేసుకున్నారు. మద్యాన్ని స్టేషన్‌కు తరలించి, నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మానాజీపేటలో..

ఖిల్లాఘణపురం, ఏప్రిల్ 25 : వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలం మానాజీపేట గ్రామంలో గురువారం 11.37 లీటర్ల మద్యాన్ని పట్టుకున్నట్లు ఏఎస్సై సత్యంగౌడ్ తెలిపారు. గ్రామానికి చెందిన గాజులపేట వెంకటయ్య ఇంటి వద్ద అధిక ధరకు మద్యాన్ని విక్రయించేందుకు గాను నిల్వ ఉంచుకోగా దాడి చేసి, మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా, బుధవారం రాత్రి వెనికితండాకు చెందిన విస్లావత్ మహేష్ 31.20 లీటర్ల మద్యాన్ని తరలిస్తుండగా మండల కేంద్ర శివారు ప్రాంతం పర్వతాపూర్ రోడ్డుపై మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై వివరించారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

పెబ్బేరురూరల్, ఏప్రిల్ 25 : అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వాసుదేవారావు తెలిపారు. వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం శాగాపూర్ గ్రామం నుంచి అనుమతి లేకుండా ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తుండగా గ్రామ శివారులో పట్టుకొని సీజ్ చేసినట్లు ఆయన వివరించారు. ఇసుకతో పాటు, వాహనాలకూ సరైన పత్రాలు లేవని ఆయన చెప్పారు.

తుమ్మిళ్ల గ్రామ సమీపంలో..

రాజోలి, ఏప్రిల్ 25 : జోగుళాంబ గద్వాల జిల్లా రాజోలి మండలంలోని తుమ్మిళ్ల గ్రామ సమీపంలోని తుంగభద్ర నది నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు రాజోలి ఎస్ఐ జగదీశ్వర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆగ్రామానికి చెందిన చెందిన బోయ వెంకట్రాముడు అనే వ్యక్తి గురువారం తెల్లవారుజామున నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో సిబ్బంది దాడులు నిర్వహించగా పెద్ద తాండ్రపాడు గ్రామం దర్గా వద్ద ట్రాక్టర్‌ను తనిఖీ చేశారు. ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించి, పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

టీటీసీ పరీక్ష ఫలితాలు విడుదల

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఏప్రిల్ 25 : గత ఫిబ్రవరిలో నిర్వహించిన టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ (టీటీసీ) పరీక్షల ఫలితాలు విడుదల చేసినట్లు డీఈవో రవీందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు ఈ నెల 30 వరకు దరఖాస్తులు స్వీకరించి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మే 1 నుంచి జూన్ 13 వరకు 42 రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ హైదరాబాద్‌లోని నాంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉంటుందని తెలిపారు.

పరస్పర దాడి ఘటనలో డీఎస్పీ విచారణ

ఆత్మకూరు, ఏప్రిల్ 25 : వనపర్తి జిల్లా ఆత్మకూరు పట్టణంలోని బీసీ కాలనీలో ఇరువర్గాలు చేసుకున్న దాడి ఘటనపై గురువారం డీఎస్పీ వెంకటేశ్వర్లు విచారణ చేపట్టినట్లు సీఐ శివకుమార్, ఎస్సై నరేందర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. ఆత్మకూరు పట్టణంలోని బీసీ కాలనీలో గత ఆదివారం గడ్డమీద శ్రీనివాసులు, రేవల్లి శ్రీనివాసులుకు చెందిన ఇరువర్గాలు ఘర్షణకు పాల్పడ్డారు. ఈ విషయంపై ఇరువర్గాలు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు అందజేయగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో భాగంగా స్థానికులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన డీఎస్పీ ఆదేశం మేరకు ఇరువర్గాలపై కేసు నమోదు చేయనున్నట్లు ఎస్సై తెలిపారు.

బాల్య వివాహం చేస్తున్న వారిపై కేసు నమోదు

రేవల్లి, ఏప్రిల్ 25 : వనపర్తి జిల్లా రేవల్లి మండలంలోని కేశంపేట పాత తండాలో బాల్య వివాహం చేస్తున్న వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై తిరుపతిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కేశంపేట పాత తండాకు చెందిన పదహారేళ్ల బాలికను ఆమె తల్లిదండ్రులు అదే గ్రామానికి చెందిన 22 ఏళ్ల వెంకటేష్‌తో బాల్య వివాహం జరుపుతున్నారు. తమకందిన సమాచారం మేరకు తండాకు వెళ్లి విచారించామని, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు బాలికతో పాటు, ఆమె తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం బాలిక తల్లిదండ్రులు, అబ్బాయి తల్లిదండ్రులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం

- నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి

కోయిలకొండ, ఏప్రిల్ 25 : మండలంలోని న ల్లవెల్లి గ్రామంలో ఇటీ వల పిడుగుపాటుకు మృతి చెందిన యువ రైతు నీలకంఠం కుటుం బాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి భరో సా ఇచ్చారు. గురువా రం మండలంలోని నల్లవెల్లిలో నీలకంఠం కుటుంబాన్ని పరామర్శించారు. పిడుగు పాటుతో మృతి చెందడం బాధాకరమని అన్నారు. అనంతరం మండలంలోని ఖాజీపూర్‌లో గుండె పోటుతో మృతి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు నారాయణరెడ్డి కుటుంబాన్ని పరామర్శించి, ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జి.రవీందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వై.విద్యాసాగర్‌గౌడ్, నాయకులు రవి నాయక్, రామస్వామి పాల్గొన్నారు.

29న మైనార్టీ గురుకులాలకు విద్యార్థుల ఎంపిక

మహబూబ్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 25 : జిల్లా కేంద్రంలోని మైనార్టీ బాలురు-1 గురుకుల పాఠశాలలో ఐదవ తరగతి ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న నాన్‌మైనార్టీ విద్యార్థులను లక్కీడిప్ ద్వారా ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా రీజినల్ కోఆర్డినేటర్ (ఆర్‌ఎల్‌సీ) ఖాజాబహోద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి లక్కీ డిప్ ప్రారంభమవుతుందన్నారు. జిల్లా కేంద్రంలోని బాలికల, బాలురు ఆరు పాఠశాలలకు సంబంధించి డిప్ ఉంటుందని, ఆన్‌లైన్ చేసుకున్న వారు హాజరుకావాలని కోరారు. మొత్తం ఉమ్మడి జిల్లాలో 20 గురుకులాల్లో మైనార్టీ విద్యార్థులకు సంబంధించి 5579 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. నాన్‌మైనార్టీ విద్యార్థులు ఎస్సీ విభాగంలో 633, ఎస్టీ 320, ఓసీ 82, బీసీ 2480, మొత్తం 3515 మంది విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారని వివరించారు. వీరికి సంబంధించి గద్వాల 22న, వనపర్తి 23న, నాగర్‌కర్నూల్ 24న, వనపర్తి 24న, నారాయణపేట 25న లక్కీడిప్ నిర్వహించినట్లు ఆయన తెలిపారు. తల్లిదండ్రులు, పిల్లల సమక్షంలో లక్కీడిప్ ద్వారా ఎంపిక చేశామని పేర్కొన్నారు. 29న మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో లక్కీడిప్ ఉంటుందన్నారు. ఎంపిక పూర్తి పారదర్శకంగా నిర్వహించామని తెలిపారు.

మలేరియా నిర్మూలనపై అవగాహన ర్యాలీ



భూత్పూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

భూత్పూర్, ఏప్రిల్ 25 : ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా గురువారం మండల వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథ మిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీహెచ్‌వో మహ్మద్ అయూబ్‌ఖాన్ మలేరియా నిర్మూలనలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వైద్య సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. రెండేళ్ల క్రితం మండలంలోని కర్వెన గ్రామ శివారులో నిర్మాణం అవుతున్న కర్వెన రిజర్వాయర్‌లో కార్మికులకు మలేరియా వ్యాధి సోకిందని, అలాంటి సంఘటనలు జరగకుండా వైద్య సిబ్బంది జాగ్రత్త పడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

● గండీడ్ : మలేరియా నివారణపై మండల కేంద్రంలోని ప్రాథమికి ఆరోగ్య కేంద్రం ఆవరణలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో మలేరియా నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ రక్షణకు సాంస్కృతిక సైనికులమవుదాం

- రచయితలు, కళాకారులకు 'సమూహ' పిలుపు

పాలమూరు, ఏప్రిల్ 25 : రాజ్యాంగాన్ని రక్షించుకునేందుకు-లౌకిక విలువలను కాపాడుకునేందుకు మనం సాంస్కృతిక సైనికులమవుదామని రచయితలు, కళాకారులకు 'సమూహ' వేదిక సభ్యులు పిలుపునిచ్చారు. ఈనెల 28న వరంగల్‌లోని కాకతీయ విశ్వవిద్యాలయంలో నిర్వహించనున్న సమూహ వేదిక రెండో మహాసభల కరపత్రాలను వేదిక సభ్యులు గురువారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవోస్ భవనంలో విడుదల చేశారు. మునుపెన్నడూ లేని విధంగా ప్రజాస్వామ్యం, ప్రజల హక్కులు, రాజ్యాంగ విలువలు పూర్తిగా ధ్వంసమైపోతున్నందున మనమే కాపాడుకోవాలన్నారు. వరంగల్‌లో జరిగే మహాసభలకు ముఖ్య అతిథులుగా కాకతీయ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ రమేష్, నందిని సిద్ధారెడ్డి, గుమ్మడి అనురాధ, లక్ష్మీనరసయ్య, జిలుకర శ్రీనివాస్, సౌదారుణ, ఖాదర్‌మొహియొద్దీన్, లోదన్‌లు పాల్గొంటారని వివరించారు. సమావేశంలో ఉదయమిత్ర, కె.సి. వెంకటేశ్వర్లు, యువకవులు ప్రభాకర్, బోల యాదయ్య, శివశంకర్, జక్క గోపాల్ ఉన్నారు.

వివాహ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ఆల

అడ్డాకుల, ఏప్రిల్ 25 : మండలంలో గురువారం మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పలు వివాహ వేడుకల్లో పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు. అడ్డాకుల మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ సోషల్‌మీడియా వారియర్ డేవిడ్‌రాజ్ వివాహ రిసెప్షన్‌కి హాజరై దంపతులను ఆశీర్వదించారు. అదేవిధంగా మూసాపేట మండల పరిధిలోని నందిపేటలో గౌని వెంకటేశ్వర్‌రెడ్డి, దీపికల వివాహ రిసెప్షన్‌కు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. ఆశీర్వదించిన వారిలో బీఆర్‌ఎస్ అడ్డాకుల, మూసాపేట మండలాల అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మీనరసింహ యాదవ్, సీనియర్ నాయకుడు చంద్రమోహన్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, మండల కోఆప్షన్ ఖాజాషోరి, దేవేందర్‌రెడ్డి, దానం నాగన్న, వెంకటేశ్ పాల్గొన్నారు.

హన్వాడలో కేంద్ర బలగాల కవాతు

హన్వాడ, ఏప్రిల్ 25 : పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని గురువారం ఎస్పీ ఆదేశాల మేరకు హన్వాడ, గొండ్యాల, వేపూర్, లింగన్నపల్లి గ్రామాలలో కేంద్ర సాయుధ బలగాలు కవాతు నిర్వహించాయి. అడిషనల్ ఎస్పీ (ఎఆర్) సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు. 30 మంది సాయుధ బలగాలు, హన్వాడ ఎస్ఐ వెంకటేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ఎన్నికల దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా గ్రామాలలో కవాతు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బీజేపీలో పలువురు నాయకుల చేరిక

మిడ్జిల్, ఏప్రిల్ 25 : బీజేపీతోనే దేశానికి రక్ష అని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యురాలు బాలాత్రిపురసుందరి అన్నారు. మండలంలోని కొత్తపల్లి, లింద్యాతండాలకు చెందిన పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు గురువారం జడ్చర్ల పట్టణంలోని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బాలాత్రిపురసుందరి సమక్షంలో బీజేపీలో చేరారు. ప్రధాని మోదీ అన్ని వర్గాల ప్రజలతో పాటు గిరిజనులు అభివృద్ధి చెందే విధంగా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి రాజేశ్వర్, యువమోర్చా జిల్లా అధ్యక్షుడు పల్లె తిరుపతి ఆధ్వర్యంలో బాలాత్రిపురసుందరి సమక్షంలో సికిందర్‌నాయక్, నరేందర్‌నాయక్, మురళినాయక్, ఓంకార్‌నాయక్, నాగరాజునాయక్, సంతోష్‌నాయక్, నాగేందర్‌నాయక్ బీజేపీలో చేరారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కావలి నరేందర్, నాయకులున్నారు.

గార్లపాడులో ప్రచారం

కోయిలకొండ, ఏప్రిల్ 25 : బీజేపీ పాలమూరు ఎంపీ అభ్యర్థి డీకే అరుణను గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు వెంకట్రామరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని గార్లపాడ్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. డీకే అరుణ గెలిస్తే పాలమూరు అన్ని రంగాల్లో అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. కరపత్రాల ద్వారా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు యాదిరెడ్డి పాల్గొన్నారు.

యూనివర్సిటీలో ప్రశాంతత నెలకొల్పాలి

- పీయూ విద్యార్థి సంఘాల నాయకులు

పాలమూరు యూనివర్సిటీ ఏప్రిల్ 25 : పాలమూరు యూనివర్సిటీ ఫార్మసి కళాశాల అకాడమిక్‌ను ప్రశాంత వాతావరణంలోకి తేవాలని పీయూ వీసీ ప్రొఫెసర్ ఎల్‌బీ లక్ష్మీకాంత్ రాథోడ్‌కి పీయూ విద్యార్థి సంఘాల (జేఏసీ) ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. అధ్యాపకులకు, సిబ్బందికి, ప్రిన్సిపాల్‌కు మధ్య నిత్యం జరుగుతున్న గొడవలపై ఒక కమిటీ వేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ బత్తిని రాము, ఏఐఎస్ఎఫ్ పీయూ అధ్యక్షుడు పవన్‌రెడ్డి, పీయూ ఎంఎస్ఎఫ్ అధ్యక్షుడు మీసాల గణేష్, మాదిగ ఎస్ఎస్‌యూ అధ్యక్షుడు సురేందర్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి దాసు, విద్యార్థి సంఘాల నాయకులు పుట్టపాగ వంశీ, వెంకటేష్, ఆంజనేయులు, నరేష్, వినయ్, రాజు, భారత్ పాల్గొన్నారు.

'విద్యారంగ సమస్యలను పార్టీలు మేనిఫెస్టోలో చేర్చాలి'

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఏప్రిల్ 25 : రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోలో విద్యారంగ సమస్యలను చేర్చాలని డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీశైలం అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. రాజకీయ పార్టీలు తమ ఓటుబ్యాంకు గురించే ఆలోచిస్తున్నాయని, విద్యారంగ సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. బడ్జెట్‌లో విద్యారంగానికి 20 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరారు. పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు రవీందర్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు ఆదిత్య, కార్యదర్శి వెంకటేశ్వర్లు, వామన్‌కుమార్ పాల్గొన్నారు.

మేనత్త అయినా పార్టీ కోసమే పని చేస్తా

- 'పేట'లో నాకన్నా ఎక్కువ మెజారిటీ ఎంపీ ఎన్నికలో ఇస్తా

- నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి



మాట్లాడుతున్న నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, చిత్రంలో జడ్పీ చైర్‌పర్సన్లు, ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి సతీమణి ఆశ్లేషారెడ్డి

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 25 : ప్రజలు మార్పు కోరుకున్నారని, అందుకే ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ఎన్నికై ప్రజలకు మెరుగైన పాలన అందిస్తున్నారని నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. కాంగ్రెస్ కార్యకర్తల కష్టంతోనే అధికారంలోకి వచ్చామని, పార్టీకోసం ప్రతీ ఒక్కరు కష్టపడి పని చేయాలన్నారు. గురువారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మహబూబ్‌నగర్, గద్వాల, నారాయణపేట జిల్లా పరిషత్ చైర్‌పర్సన్లు వరుసగా స్వర్ణాసుధాకర్‌రెడ్డి, సరిత, వనజ, వంశీచంద్‌రెడ్డి సతీమణి ఆశ్లేషారెడ్డితో కలిసి ఆమె విలేకరులతో మాట్లాడారు. ఆరు గ్యారెంటీలను చిత్తశుద్ధితో అమలుచేసేందుకు ప్రభుత్వం పని చేస్తుందని గుర్తు చేశారు. బీజేపీ అభ్యర్థి డీకే అరుణ తనకు మేనత్త అయినంత మాత్రాన కాంగ్రెస్ నుంచి గెలిచిన తాను ఆమెకు ఎలా మద్దతు ఇస్తానని ప్రశ్నించారు. చాలామందిలో ఈ అపోహ ఉన్నదని, ఎవరూ అలాంటివి పెట్టుకోవద్దని ఖచ్చితంగా తాను పార్టీ కోసమే పనిచేస్తానని పర్ణికారెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి తమ నియోజకవర్గానికి సాగునీరందించేందుకు నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతలను తీసుకువచ్చినందుకు కష్టపడి పనిచేసి ఆయన రుణం తీర్చుకుంటానని తెలిపారు. ఎమ్మెల్యే ఎన్నికల్లో తనకు ఎంత మెజారిటీ వచ్చిందో వంశీచంద్‌రెడ్డికి పార్లమెంట్ ఎన్నికలో అంతకన్నా ఎక్కువ మెజారిటీ తీసుకువస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఎంతో కష్టపడితేగాని వంశీచంద్‌రెడ్డి యువజన కాంగ్రెస్ నుంచి సీడబ్ల్యూసీ వరకు వెళ్లారని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికలో కాంగ్రెస్‌ను గెలిపించారని, మరోసారి ఎంపీ ఎన్నికలో కాంగ్రెస్‌ను గెలిపించి పాలమూరు అభివృద్ధిలో భాగస్వామ్యం అవుదామన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వానికి భవిష్యత్తు లేదు

- చిన్నచిన్న పొరపాట్ల వల్ల మా ప్రభుత్వం పోయింది

- ప్రజలు తిరిగి కేసీఆర్ ప్రభుత్వాన్ని కోరుతున్నారు : ఎంపీ మన్నె



రిటర్నింగ్ అధికారి జీ రవినాయక్‌కు నామినేషన్ పత్రాలను దాఖలు చేస్తున్న ఎంపీ మన్నెం శ్రీనివాస్ రెడ్డి

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్)/ మహబూబ్‌నగర్, ఏప్రిల్ 25 : కాంగ్రెస్ ప్రభుత్వానికి భవిష్యత్తు లేదు, మా ప్రభుత్వం చిన్న చిన్న పొరపాట్ల వల్ల అధికారం కోల్పోయిందని ఎంపీ మన్నె శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం బీఆర్‌ఎస్ మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఎంపీ అభ్యర్థిగా ఆయన మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు లక్ష్మారెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, అంజయ్యయాదవ్ తదితరులతో కలిసి మూడు సెట్ల నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ జీ రవినాయక్‌కు సమర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఉద్యమ నాయకుడు కేసీఆర్ 2019లో నాకు ఎంపీ టికెట్ ఇచ్చాడు. చిన్న చిన్న పొరపాట్ల వల్ల ఈ రోజు బీఆర్‌ఎస్ ప్రభుత్వం పోయిందన్నారు. తెలంగాణ ప్రజలు తిరిగి బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని కోరుతున్నారని, రాష్ట్రంలో 10 ఎంపీ సీట్లను గెలువబోతున్నట్లు తెలిపారు. అంతకు ముందు నా అనుచరులైన టీ శ్రీధర్‌రెడ్డి ద్వారా ఈ నెల 19న 1 సెట్ నామినేషన్ పత్రాలను సమర్పించినట్లు తెలిపారు. మా ప్రభుత్వం ఉన్నప్పుడు రైతులకు 24 గంటల కరెంట్, సకాలంలో రైతు బంధు, తదితర పథకాలు అందించామన్నారు. కాంగ్రెస్ పాలన రాగానే కరెంట్ పోయింది, రైతులు ఏసుకున్న పంటలు ఎండిపోయాయి, రుణమాఫీ లేదు, పరిశ్రమలు మూత పడుతున్నాయని ఆరోపించారు. మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ బీజేపీ, కాంగ్రెస్ ఒక్కటై అసెంబ్లీ ఎన్నికల్లో తన ఓటమికి పని చేశాయన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు వెంకటేశ్వర‌రెడ్డి, వాల్యానాయక్, యాదయ్య రాజేశ్వర్‌గౌడ్, కొరమోని నరసింహులు, కొరమోని వెంకటయ్య, అబ్దుల్ రహమాన్ పాల్గొన్నారు.

బైపాస్ రోడ్డు మంజూరుకు కృషి చేస్తాం

- సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి పెద్ద మొత్తంలో నిధులు తెస్తాం

- ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

మిడ్జిల్, ఏప్రిల్ 25 : జడ్చర్ల పట్టణంలోని ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు బైపాస్ రోడ్డు ఏర్పాటుకు కృషి చేయనున్నట్లు ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని బోయిన్‌పల్లి గ్రామంలో ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం ఎన్నికైన తర్వాత రాష్ట్రంలో పెద్ద మొత్తంలో నిధులు మంజూరైన నియోజకవర్గంలో జడ్చర్ల మూడో స్థానంలో ఉందని తెలిపారు. జకినాలపల్లి తుర్కచెరువుకు రూ.11కోట్లు ఎన్నికల తర్వాత మంజూరు చేయిస్తానని పేర్కొన్నారు. కొత్తూరు, వెలుగొమ్ముల, అయ్యవారిపల్లి, చిలువేరు, రెడ్డిగూడ వరకు సెంట్రల్, స్టేట్ ఫండ్స్ ద్వారా డబుల్‌రోడ్డు కోసం నిధులను మంజూరు చేసినట్లు తెలిపారు. ఇసుకను తానే సీజ్ చేయించానని, దంపులు తరలిస్తుంటే నిలిపివేయింనట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. నియోజకవర్గంలో ప్రతీ పేదవారికి తాను అండగా ఉంటానని, అవినీతి రహిత పాలన అందించేందుకు ప్రయత్నిస్తున్నానని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి మునుముందు పెద్ద మొత్తంలో నిధులు తీసుకొచ్చి, అన్ని రంగాలలో అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అల్వాల్‌రెడ్డి, ఎంపీటీసీ గౌస్, నాయకులు శివకుమార్‌బాద్మీ, నిఖిల్‌రెడ్డి, అబ్దుల్ సమి, ప్రశాంత్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, చల్మారెడ్డి, వెంకటయ్య, మల్లికార్జున్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, సత్యంగుప్తా, రాముగౌడ్, ధర్మేందర్‌రెడ్డి, నర్సిరెడ్డి, సత్యనారాయణ్‌రెడ్డి, సర్దార్, పర్వత్‌రెడ్డి, జహీర్, హరిప్రసాద్‌రెడ్డి ఉన్నారు.

మే 1 నుంచి షటిల్ బ్యాడ్మింటన్ సమ్మర్ కోచింగ్

మహబూబనగర్‌స్పోర్ట్స్, ఏప్రిల్ 25 : మహబూబ్‌నగర్ షటిల్ బ్యాడ్మింటన్ ఆధ్వర్యంలో మే 1 నుంచి 31వ తేదీ వరకు సమ్మర్ కోచింగ్ నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా కార్యదర్శి ఎల్.రవికుమార్, కార్యనిర్వాహక కార్యదర్శి సాదత్‌ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని స్టేడియం మైదానంలో గల ఇండోర్ స్టేడియంలో ఉదయం, సాయంత్ర శిక్షణ ఉంటుందని, ఆసక్తి గల క్రీడాకారులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరింత సమాచారం కోసం 9848085211, 9866928835 నంబర్లను సంప్రందించాలని కోరారు.

భారత రాజ్యాంగం మహోన్నతమైంది

- పీయూ ప్రొఫెసర్ భూమయ్య



సదస్సులో మాట్లాడుతున్న పీయూ ప్రొఫెసర్ భూమయ్య

పాలమూరు, ఏప్రిల్ 25 : భారత దేశ రాజ్యాంగం మహోన్నతమైందని పాలమూరు యూనివర్సిటీ ప్రొఫెసర్ భూమయ్య అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో సామాజిక సంఘాల వేదిక ఆధ్వర్యంలో 'భారత రాజ్యాంగానికి ఎదురవుతున్న సవాళ్లు' అనే అంశంపై ఏర్పాటు చేసిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డా.బి.ఆర్ అంబేడ్కర్ సుమారు 60 దేశాల రాజ్యాంగాలను పరిశీలించి, రూపొందించిన రాజ్యాంగమన్నారు. రాజ్యాంగ పీఠికలో భారత ప్రజలందరికీ స్ఫూర్తిదాయకంగా ఉందన్నారు. లౌకికతత్వం ప్రజాస్వామ్యం, సామ్యవాదం లాంటి మహోన్నత లక్ష్యసాధనకు ఉద్దేశించబడిందన్నారు. ఇలాంటి రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. కిల్లెగోపాల్, ఎం.కుర్మయ్య, మాణిక్యంరాజు, వి.కుమార్మూర్తి, యం.ఆనందు, పద్మ, ఖయ్యూం మాట్లాడారు. జ్యోతిరావు పూలే, డా.బి.ఆర్ అంబేడ్కర్ ఆశయాలను పునికిపుచ్చుకోవాలని నాయకులు ప్రజలకు పిలుపునిచ్చారు. బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని రద్దు చేసేందుకు కుట్రలు చేస్తోందన్నారు. అంబేడ్కర్ రూపొందించిన రాజ్యాంగం పనికిరాదని, మనువు సంస్మృతే మన రాజ్యాంగమని బీజేపీ ఎంపీలే బాహాటంగా చెబుతున్న విషయాన్ని గుర్తు చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దళితులపై దాడులు, హత్యలు, అత్యాచారాలు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. మోడి బీసీ నేత అని బీజేపీ నాయకులు గొప్పగా చెప్పుకుంటారు కానీ, ఆ బీసీ కులగణన ఎందుకు చేయటంలేదో సమాధానం చెప్పాలన్నారు. కుల, మతాల పేరుతో దేశప్రజల్లో చిచ్చుపెట్టే బీజేపీని తరిమి కొట్టాలన్నారు. కార్యక్రమంలో లక్ష్మీదేవి, వెంకట్రాములు, బాలరాజు, ఆది విష్ణు, వేణు, బాలయ్య, నాగన్న, కృష్ణ, లలితమ్మ పాల్గొన్నారు.

బంటు రామాంజనేయులు కుటుంబానికి న్యాయం చేయాలి

- బాధిత న్యాయ పోరాట సంఘీభావ కమిటీ

పాలమూరు, ఏప్రిల్ 25 : గండీడ్ మండలం, పగిడ్యాల గ్రామంలో బంటు రామాంజనేయులు కుటుంబానికి న్యాయం చేయాలని బాధిత న్యాయ పోరాట సంఘీభావ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని టీఎఫ్‌టీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి నాయకులతో కలిసి వివరించారు. ముదిరాజ్ సామాజికవర్గానికి చెందిన బంటు రామాంజనేయులు అదేగ్రామానికి చెందిన అన్నసారం కృష్ణారెడ్డి దగ్గర మూడేళ్ల నుంచి బోరుబండిపై పని చేస్తున్నాడని తెలిపారు. ప్రారంభం నుంచి నేటివరకు జీతం ఇవ్వలేదని, రామాంజనేయులుకు చెందిన భూమిపై పంటరుణం రూ.లక్షన్నర వస్తే ఆ డబ్బులను కూడా కృష్ణారెడ్డి తన అకౌంట్‌కు బదిలీ చేయించుకున్నాడని వారు చెప్పారు. మొత్తం నాలుగైదు లక్షలు కృష్ణారెడ్డి వద్దనే ఉన్నాయని, రామాంజనేయులు ఇంటి నిర్మాణం చేసేటప్పుడు మొత్తం ఇస్తానని చెబుతూవచ్చాడని తెలిపారు. కానీ, మొత్తం డబ్బు ఎగ్గొట్టడానికి రామాంజనేయులుపై డీజిల్ దొంగతనం నెపం మోపి, బలవంతాన ఒప్పించటానికి ప్రయత్నిస్తే ఒప్పుకోకపోవటంతో గత మార్చి ఏడున రామాంజనేయులు ఇంటికి వచ్చి మన్యపురెడ్డి వేధింపులకు తట్టుకోలేక ఆవేదనకు గురై గడ్డిమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని తల్లి వెంకటమ్మ ఆవేదనతో తెలిపారు. యువకుడి శవంతో గ్రామస్థులు నిందితుడు ఇంటి ముందు నిరసన తెలిపారని, పోలీసులు నిందితుడి ఒత్తిడితో 11మంది ప్రజలపై కౌంటర్ కేసులు నమోదు వేసి అన్యాయాన్ని అడగకుండా చేశారని అంబేడ్కర్ సంఘం నాయకుడు గౌరగల్ల కృష్ణ తెలిపారు. అన్నసారం కృష్ణారెడ్డి, మన్యపురెడ్డిలను కఠినంగా శిక్షించాలని కోరారు. బాధితులపై పెట్టిన కౌంటర్ కేసులను ఎత్తివేయాలని, బాధిత కుటుంబానికి రూ.50లక్షల నష్టపరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇల్లు, ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో పూలే-అంబేడ్కర్ సంఘం నాయకులు గౌరగళ్ల కృష్ణ, దళిత బహుజన శ్రామిక యూనియన్ నాయకులు ఎర్ర కృష్ణయ్య, ఎమ్మార్పీఎస్ నాయకులు వై.అచ్చన్న, బీసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయాదవ్, టీఎఫ్‌టీయూ అధ్యక్షుడు పి.విజయ్‌కుమార్, కెఏఎస్‌పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ గోవిందు, ఎర్ర మోహనకృష్ణ, మృతుని తల్లి వెంకటమ్మ, అక్కలు శ్రీశైల, లక్ష్మమ్మ, రామంజమ్మ, లాలయ్య, కృష్ణయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

- ఘనంగా నందికోలు సేవ, అగ్నిగుండం



నందికోలసేవా కార్యక్రమంలో భక్తులు

చిన్నచింతకుంట, ఏప్రిల్ 25 : మండలంలోని చిన్న వడ్డెమాన్ గ్రామ సమీపంలోని రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం అఖండభజనలు జరగగా, అర్ధరాత్రికి (గురువారం), 1-55 నిమిషాలకు నందికోలు సేవ కార్యక్రమం కనుల పండువగా జరిగింది. ఓం నమఃశివాయ నామంతో ఖడ్గాలు చదువుతూ భక్తులు నందికోలు సేవలో పాల్గొని, ఆటపాటతో పరవశించారు. తెల్లవారుజామున ఐదు గంటల వరకు నందికోలు సేవల్లో భక్తులు తరించారు. అనంతరం స్వామి ఆలయం ఎదుట ఏర్పాటు చేసిన అగ్నిగుండం కార్యక్రమం ఎంతో ఘనంగా జరిగింది. దాదాపు వందమంది భక్తులు అగ్నిగుండంలో నడిచారు. దీన్ని తిలకించేందుకు ఆయా గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. అయితే రుద్రాభిషేకం, అన్నపూర్ణాదేవికి సూక్ష్మముగా అభిషేకం అర్చనా కార్యక్రమాలు జరిగాయి. సాయంత్రం 6-45 గంటలకు డోలారోహణం జరిగింది. ఇందులో భక్తులు పాల్గొని తరించారు. ఆలయ పూజారి వీరేశం, వేదపండితులు శివశక్తిస్వామి, సాయి, సభ్యులు ప్రభు, గుబ్బ శ్రీనివాసులు, కృష్ణయ్యశెట్టి పాల్గొన్నారు.

ప్రారంభమైన ఓపెన్ పది, ఇంటర్ పరీక్షలు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఏప్రిల్ 25 : తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే ఓపెన్ పది, ఇంటర్ పరీక్షలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. పది పరీక్షలు ఐదు కేంద్రాలలో నిర్వహించగా 388 మందికిగాను 325 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఇంటర్ పరీక్షలకు సంబంధించి ఐదు కేంద్రాలలో పరీక్షలు నిర్వహించగా 719 మంది గాను 615 మంది అభ్యర్థులు హాజరయ్యారు. జిల్లా కేంద్రంలోని షాషాబ్‌గుట్ట ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాన్ని ఓపెన్‌స్కూల్ కోఆర్డినేటర్ రామ్‌సుభాష్‌గౌడ్‌తో కలిసి డీఈవో రవీందర్ పరిశీలించారు. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించాలని సూచించారు.

'ఎన్నికల సందేహాలకు సాధారణ పరిశీలకులను నేరుగా సంప్రదించవచ్చు'

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్), ఏప్రిల్ 25 : లోక్ సభ ఎన్నికల సందర్భంగా మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి ఏమైనా సందేహాలు, ఫిర్యాదులకు భారత ఎన్నికల సంఘం నియమించిన సాధారణ పరిశీలకులు షెవాంగ్ గ్యాచో భూటియా (ఐఏఎస్) మొబైల్ నంబర్ 9059797275, మెయిల్ ఐడి జనరల్ అబ్జర్వర్ 011 ఎట్‌ద రేట్‌ఆఫ్ జీమెయిల్.కంలో, ఎన్నికల వ్యయ పరిశీలకులు వరుణ్ రంగస్వామి (ఐఆర్‌ఎస్), మొబైల్ నంబర్ 8522875617, మెయిల్ ఐడీలో సంప్రదించ వచ్చని వారు తెలిపారు. నేరుగా సంప్రదించాలనుకునేవారు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో సంప్రదించవచ్చని వారు తెలిపారు. నామినేషన్‌ల దాఖలు ప్రక్రియకు గురువారం తుది రోజుకావడం వల్ల కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ చాంబర్‌లో సాధారణ పరిశీలకులు షెవాంగ్ గ్యాచో భూటియా నామినేషన్ ప్రక్రియను పరిశీలించారు.

గ్రామాల్లో సమస్యల్లేకుండా చూడాలి

దేవరకద్ర, ఏప్రిల్ 25 : మండలంలోని ప్రతీ గ్రామంలో ఏ సమస్యా లేకుండా చైడాలని ఎంపీడీవో శ్రీనివాస్‌రావు పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో వారికి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాలను ప్రతీ రోజు పరిశీలించాలని, ఎక్కడైనా సమస్యలుంటే వాటిని వెంటనే పరిష్కరించాలన్నారు. పరిశుభ్రత, తాగునీరు వంటి సమస్యలను చూడాలన్నారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నర్సరీని పరిశీలించిన డీఆర్‌డీవో పీడీ నర్సింహులు



నర్సరీని పరిశీలిస్తున్న డీఆర్‌డీవో పీడీ నర్సింహులు

బాలానగర్, ఏప్రిల్ 25 : మండలంలోని గౌతాపూర్‌లో నర్సరీని జిల్లా గ్రామీణ అధికారి నర్సింహులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీల్లో మొక్కల పెంపకంపై నిర్వహకులు జాగ్రత్తలు పాటించాలని అన్నారు. మొక్కలు ఎండి పోకుండా నర్సరీల పెంపకందారులు జాగ్రత్తలే తీసుకోవాలని సూచించారు. మొక్కలకు ఉదయం, సాయంత్రం వేళలో నీరు పోసి సంరక్షించాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో శరత్ చంద్ర బాబు, రాజశేఖర్, గ్రామ కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

బాలానగర్, ఏప్రిల్ 25: రాబోయో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాలను డీఆర్‌డీఏ పీడీ నర్సింహులు పరిశీలించారు. గురువారం మండలంలోని గౌతాపూర్ గ్రామంలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలలో మౌళిక వసతులు ఉన్నాయా? లేవా అని గుర్తించాలని సూచించారు. ముందుగా గ్రామాలలోని ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల వద్ద గల పరిస్థితులపై సిబ్బందితో ఆరా తీశారు. ఆయన వెంట ఎంపీడీవో శరత్‌చంద్రబాబు, రాజశేఖర్‌రెడ్డి, గ్రామ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

28న చిత్రలేఖనం పోటీలు

మహబూబ్‌నగర్ టౌన్, ఏప్రిల్ 25 : ప్రఖ్యాత చిత్రకారుడు రాజారవివర్మ జయంతిని పురస్కరించుకొని ఈ నెల 28న ఉదయం 9 గంటలకు తెలంగాణ చౌరస్తాలోని శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం ప్రాంగణంలో గత స్వరాలహరి కల్చర్ అకాడమీలో స్ఫూర్తి సామాజిక సేవా కళాసంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రకళ నైపుణ్యం పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ జూనియర్ విభాగంలో 1 నుంచి 4 తరగతి వరకు గల వారికి అందమైన ప్రకృతి, జూనియర్ విభాగం ఐదవ తరగతి నుండి ఏడవ తరగతి వారికి మొక్కలని పెంచాలని, ప్రకృతిని రక్షించాలని, సీనియర్ విభాగంలో ఎనిమిదో తరగతి నుంచి ఇంటర్ విద్యార్థులకి ఓటర్‌పై రాజకీయ ప్రలోభాలు, మంచి నాయకుడి వల్ల లాభాలు, అనే అంశాలపై చిత్ర లేఖనం పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల్గిన వారు తమతో పాటు డ్రాయింగ్ మెటీరియల్స్ తీసుకొని రావాలని కోరారు.

టెట్ నుంచి ఉపాధ్యాయులను మినహాయించాలి

- టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఏప్రిల్ 25 : ఉద్యోగం చేస్తున్న ఉపాధ్యాయులకు ప్రభుత్వ టెట్ అర్హత తప్పని సరిఅని అది ఉంటేనే పదోన్నతులు అని చెప్పడం సరికాదని, వెంటనే ఈ నిర్ణయాన్ని మినహాయించాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని యూటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు పన్నుభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. పాతపెన్షన్ విధానం పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి, జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, ప్రధాన కార్యదర్శి రవికుమార్, సీనియర్ నాయకులు ఎన్.కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

పాలమూరు పార్లమెంట్ బరిలో బీఎస్పీ

- నామినేషన్ వేసిన మహ్మద్ అల్లావుద్దీన్ పటేల్

మహబుబ్ నగర్ రూరల్, ఏప్రిల్ 25 : పాలమూరు పార్లమెంట్ బరిలో బీఎస్పీ ఏ పార్టీకి మద్దతు పలకకుండా స్వతంత్రంగా పోటీ చేస్తుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బోయ శ్రీనివాసులు తెలిపారు. అందులో భాగంగానే గురువారం జిల్లా ఎన్నికల అధికారి రవి గుగులోత్‌కు బీఎస్పీ తరఫున నామినేషన్ పత్రాలను పార్టీనాయకులతో కలిసి అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బిఎస్‌పి పార్టీ బడుగు బలహీన వర్గల పార్టీఅని అందరు ఆదరించాలని అత్యధిక మెజార్టితో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మహబుబ్‌నగర్ జిల్లా ఇంచార్జి దార రాంచందర్,దేవరకద్ర ఇచార్జి సంతోష్ రెడ్డి,జడ్‌చర్ల ఇంచార్జి విజయ్‌కుమార్,దాడి శ్రీనివాస్, బసిరెడ్డి, పాల్గొన్నారు.